సంక్రాంతి కానుకలు అందించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:- ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు సంక్రాంతి కానుకలు అందించాలని ఆదివాసి గిరిజన సంఘం నేతలు జీనబంధు, నారాయణలు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కరిముక్కి పుట్టు పంచాయతీ కాంగుల గ్రామంలో రేషన్ సరుకుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా జీనబంధు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో పండుగ కానుకలు ఎటువంటిది అందలేదని, కనీసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వమైన బెల్లం, గోధుమపిండి, కొమ్ము సెనగలు, గోధుమలు, రాగి పిండి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో రామన్నా, రాంబాబు, నీలకంఠం రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

వాహనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సిపిఎం నేతలపై దాడి చేసిన వారిపై

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అనంతగిరి మండలం బింపోలు పంచాయితీ సిపిఎం నేతలు జె వెంకటరమణ, ఆర్.శ్రీనులపై దాడి చేసిన గిరిజనేతరులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు.ఆదివారం అరకులోయ స్థానిక విలేకరులతో మాట్లాడారు. గిరిజనులు తరతరాలుగా సాగు చేస్తున్న భూములను మైదాన ప్రాంతానికి చెందిన గిరిజనేతరులు అక్రమంగా ఆక్రమించి దౌర్జన్యం చేస్తూ భౌతికంగా దాడి చేసి భయభ్రాంతులకు ఎంతవరకు సమంజసం ప్రశ్నించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి స్థానికంగా ఉన్న గిరిజనులపై భౌతిక దాడి, అత్యాయత్నం చేసిన వారిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనేక దఫాలుగా భూమి సమస్యపై అక్కడున్న గిరిజనులు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పరిష్కారం చేయకపోవడంతో రోజురోజు ఆదివాసి గిరిజనులు బానిసలుగా జీవిస్తున్నారన్నారు. భూ సమస్య వెంటనే పరిష్కారం చేయాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భూ బకాసురుల నుండి గిరిజనులకు ప్రాణహాని ఉందని వారి నుండి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర

మన్యంలో పర్యాటకుల సందడి

అరకులోయలో పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి-అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకు లోయలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. మునుపెన్నడు లేని విధంగా గత నెల రోజులుగా పర్యాటకులు వేల సంఖ్యలో తరలి వస్తున్నారు. జనవరి మొదటి వారం నుంచి పర్యాటకుల సంఖ్య క్రమంగా తగ్గుతుందని అందరు భావించినప్పటికీ, ఇప్పటికి పర్యటకుల సంఖ్య ఏమాత్రం కూడా తగ్గుముఖం పట్టలేదు. ఆదివారం కూడా పర్యాటకులు తరలివచ్చారు.దీంతో అరకు ప్రాంతంలోని పర్యాటక సందర్శిత ప్రాంతాలు కిటకిట లడాయి. మరమ్మత్తుల దృష్ట్యా పద్మావతి ఉద్యాన కేంద్రం ఈనెల మూడు నుంచి 11 వరకు మూసి వేస్తున్నట్లు పాడేరు ఐటీడీఏ పీవో ప్రకటించినప్పటికీ, వందల సంఖ్యలో ప్రతిరోజు తరలివచ్చి నిరాశతో వెను తిరుగుతున్నారు. దీంతో అరకులో గిరిజన సంస్కృతిక మ్యూజియం, కాఫీ మ్యూజియం చాక్లెట్ ఫ్యాక్టరీ కిటకిటలాడుతున్నాయి. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి రావడంతో గత నెల రోజుల నుంచి అరకు విశాఖ ఘాట్రోడ్లో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. పెరుగుతున్న పర్యాటకులతో ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్ దృష్ట్యా స్థానిక పోలీసులకు సవాలుగా మారింది. సిఐ, ఎస్సైల పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పర్యాటకులు, ప్రయాణికులు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య పెరగడం, ట్రాఫిక్ జాం ఘాట్రోడ్లో ఏర్పడుతున్న దృష్ట్యా ఇప్పటికే కాపీ తోటలోని ఉడెన్ బ్రిడ్జి మూసివేసిన విషయం తెలిసిందే. సంక్రాంతి సెలవులు సమీపిస్తుండటంతో ఇంకా పర్యటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

డుంబ్రిగుడ: మండలంలో పర్యాటక ప్రదేశాలైన చాపరాయి జలపాతంలో సుమారు గత ఐదు, ఆరు వారాల బట్టి పర్యాటకుల తాకిడి తగ్గడం లేదు. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వస్తుండడంతో పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. చాపరాయి జలపాతంలో సరదాగా జారుకుంటూ స్నానాలు చేస్తూ పర్యాటకులు ఆనందంగా గడిపారు. అరకు పినారిలోని అందమైన ఎత్తయిన చెట్లు మధ్యన ఫోటోలు తీయించుకుంటూ పర్యాటకులు సందడి చేశారు. గత మూడు రోజుల నుంచి ఈ పర్యాటక ప్రదేశాల్లో అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివస్తుండడంతో పర్యాటక ప్రదేశాలన్నీ పర్యాటక వాహనాలతో పర్యాటకుల సందడితో కిటకిటలాడుతున్నాయి. ఆదివారం చాపరై జలపాతం లో అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్డుకి ఇరువైపులా అడుగడుగునా వంటలు చేసి వన బోజనాలు చేస్తూ ఆటపాటలతో పర్యాటకులు సందడి చేశారు.


చాపరాయి వద్ద పర్యాటకులు

చలి పులి పంజా!

- మంచు దుప్పటిలో మన్యం
- గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- గజగజలాడిపోతున్న గిరిజనం
- చలి మంటలు, ఉన్ని దుస్తులు, రగ్గులతో ఉపశమనం

ప్రజాశక్తి -సీలేరు/ రాజవొమ్మంగి: మన్యంలో చలితీవ్రత బాగాపెరిగింది.గడచిన నాలుగైదు రోజులుగా వాతావరణంలో మార్పులతో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడంతో చలి తీవ్రతకు గిరిజనం గజగజలాడిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటలు కాకుండానే మంచుకురుస్తుండడంతో, చీకటి ముసురుకునే పరిస్థితులు కనిపించడంతో పాటు చలి తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రాలేకపోతున్నారు. సీలేరు నది పరివాహక ప్రాంతం సమీపంలో నివసిస్తున్న చింతపల్లి క్యాంపు జిడిసి క్యాంపు గిరిజనులు పొద్దుపోకముందే చలిమంటలు కాగుతూ, చలి తీవ్రత నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఇక రాత్రివేళల్లో ఇళ్లల్లో చలి కుంపట్లు పెడితేగానీ కంటికి కునుకురాని పరిస్థితి ఉందని అంటున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు దట్టంగా పొగమంచు కురుస్తూ, వాతావరణంఅతి శీతలంగా మారుతుంది. చలితోపాటు చల్లని చిరుగాలులు వీస్తుండడంతో చలికి తాళలేక గిరిజనం వణికిపోతున్నారు. పిల్లలు, వృద్ధులు, రోగులు చలి, మంచు తీవ్రతకు ఊపిరి సలపని పరిస్థితి ఉంది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను బట్టి రానున్న మరో రెండు వారాల పాటు చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఇప్పటికి సింగిల్ డిజిట్కు పడిపోయిన ఉష్ణోగ్రతలు, మున్ముందు మరింత తగ్గిగే కష్టమేనని ఈ ప్రాంతీయులు అంటున్నారు. ఇదిలా సాయంత్రం పొద్దుగూక ముందునుంచే ప్రారంభమైన మంచు, ఉదయం 9గంటల వరకు వీడకుండా ఉండడంతో ప్రధానమార్గంలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఇక హెడ్లైట్లు లేకుండా ఉదయం పూట వాహనాలు ముందుకు కదలని పరిస్థితి ఉంది. చలి తీవ్రతను తట్టుకోవడానికి చలిమంటలతోపాటు, ఉన్ని దుస్తులను, రగ్గులను కప్పుకుంటూ ఏజెన్సీవాసులు ఉపశమనం పొందుతున్నారు.

ఇక రాజవొమ్మంగి మండలం కాకరపాడు నుంచి, అలాగే రంపచోడవరం వైపు నుంచి పోలవరం వెళ్లే జాతీయ రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనుల వల్ల కొన్నిచోట్ల రహదారిపై కల్వర్టుల నిర్మాణానికి గోతులు తవ్వడం, ఆయాప్రాంతాల్లో కానరానట్లుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో మంచు ముసుగులో అటుగా వెళ్లేవారు సకాలంలో గుర్తించలేని పరిస్థితుల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాబోవు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరికలు నేపథ్యంలో ప్రజలుభీతిల్లుతున్నారు. దగ్గు, జలుబు, ఆయాసం, జ్వరం, శ్వాససంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. రుగ్మతలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు తెలుపుతున్నారు.మన్య వాసులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అయితే తప్ప మంచులో బయటకు వెళ్లొద్దని, ఒకవేళ వెళాల్సివస్తే ఒంటినిండా చలి దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

అరకులోయ: మండలంలో గత వారం రోజులుగా మంచు వర్షం కురుస్తుంది. చలి తీవ్రత కూడా గత వారం రోజులుగా పెరిగింది. ఇంటి నుండి బయటకు రావడానికి ఆయా ప్రాంతాల వాసులు భయపడిపోతున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి తీవ్రత మొదలవుతుంది. ఉదయం వేళలో వర్షం మాదిరిగా పొగ మంచు కమ్ముకుని ఉండడంతో వాహన రాకపోకలు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. పర్యాటకులు మాత్రం ఎముకలు కోరికే చలిని సైతం లెక్క చేయకుండా అరకు లోయ ప్రకృతి అందరాలను వీక్షించి తిరుగు ప్రయాణం కడుతున్నారు.

దట్టమైన మంచులో సైకిలుపై వెళుతున్న మన్యవాసులు

అరకులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

పొగమంచులో దారి కానరాక జాతీయ రహదారిలో బైక్ ప్రమాదం

ఐద్వా ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు

● ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఎంపిపి తదితరులు

ప్రజాశక్తి- విఆర్ పురం: మండలంలోని పెద్దమటపల్లి పంచాయతీ కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యాన ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి ముగ్గుల పోటీలు ప్రారంభం సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలపై దాడులను అరికట్టేందుకు ఇప్పుడున్న మహిళా చట్టాలతోపాటు మరిన్ని కఠిన చట్టాలు తెచ్చి వాటి అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలన్నారు.ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎంపిపి కారం లక్ష్మి.మాజీ ఎంపిపి సున్నం.నాగమ్మ, సర్పంచ్ వెట్టి.లక్ష్మి, చిన్నమట్టపల్లి మహిళా పోలీస్ దీప బహుమతులు అందజేశారు.. కార్యక్రమంలో మహిళా సంఘం మండల కార్యదర్శి సున్నం పార్వతి, మండల నాయకురాలు కారం.దారమ్మ పాల్గొన్నారు.

41.15 కాంటూరులో కలపాలి

మురుమూరు గ్రామస్తుల డిమాండ్

ప్రజాశక్తి -ఎటపాక: మురుమూరు గ్రామాన్ని పోలవరం ముంపు జాబితాలో చేర్చి, 41.15 కాంటూరులో కలపాలని గ్రామపంచాయతీ సర్పంచ్ నాగమణి, పీసా కార్యదర్శి ఆసు ప్రసాద్. కోరారు. ఆదివారం సర్పంచ్, పీసా కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ మురుమూరు గ్రామాన్ని పోలవరం ముంపు జాబితాలో కాంటూరు 45.72 జాబితాలో చేర్చారన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కాకుండానే ప్రతి సంవత్సరం వరదలు వచ్చినప్పుడు, 43 అడుగులకు గ్రామంలో వరద నీరు చేరుతుందన్నారు. 50 అడుగులకు వరదలు వచ్చినప్పుడు గ్రామంలో సగానికంటే ఎక్కువ ఇళ్లే ముంపు బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో వచ్చిన వరదలకు. గ్రామం మొత్తంగా ముంపునకు గురైందన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. దీంతో గ్రామస్తులందరూ సమిష్టిగా సమావేశమై, దీనిపై తీర్మానం చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. గతంలో ఇళ్లకు సంబంధించి స్ట్రక్చర్ సర్వే కూడా నిర్వహించారు కానీ. ఇప్పటివరకు ఆర్అండ్ఆర్ గానీ, మిగులు భూమికి సంబంధించి గానీ, ఎకరం రెండు ఎకరాలు ఉన్నటువంటి వారు కూడా పరిహారం తీసుకోలేదన్నారు. మిగులు భూములు చూపించలేదన్నారు. మురుమూరు గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ నాగమణి

స్వర్ణోత్సవ సభకు తరలిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- అడ్డతీగల : స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం కాకినాడలో నిర్వహించిన యుటిఎఫ్ 17వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలకు రాష్ట్ర సంఘం పిలుపుమేరకు అడ్డతీగల మండల నుంచి భారీగా ఉపాధ్యాయులు తరలివెళ్లారు. యుటిఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో చలో కాకినాడ పిలుపునకు స్పందించి, స్థానిక ఎంఆర్సి నుంచి ఉపాధ్యాయులు, యుటిఎఫ్ ప్రతినిధులు బయలుదేరి వెళ్లినట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి జి.తేజోరావు తెలిపారు. కాకినాడ యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల తరలివెళ్లిన వారిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. యూనియన్ పిలుపునకు స్పందించి, చలో కాకినాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, యుటిఎఫ్ ప్రతినిధులకు తోజోరావు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ కార్యకర్తలు పి.మంగరాజు, జెబివి.రమణమ్మ, ఎస్. నాగప్రసాద్, జి.మల్లేశ్వరి, కె.చిన్నారావు, సిహెచ్. వెంకటేశ్వరరావు, సిహెచ్.సుందరరావు, పి. యర్రం రెడ్డి, డి.అశోక్, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కెవి.రాఘవులు పాల్గొన్నారు.

ఎంఆర్సి నుంచి బయలుదేరి వెళుతున్న ఉపాధ్యాయులు

దుస్తులు ఇస్తున్న జెడ్పిటిసి

భరోసా ట్రస్ట్ సేవలు అభినందనీయం

-జెడ్పిటిసి పోతురాజు బాలయ్య

ప్రజాశక్తి - చింతపల్లి : భరోసా లవ్ ఫర్ హ్యుమానిటీ ట్రస్ట్ బియాన్ డోనర్ భాగస్వామ్యంతో మన్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జెడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. మండలంలోని చిన్నగడ్డ గ్రామంలో ఆదివారం భరోసా లవ్ ఫర్ హ్యుమానిటీ ట్రస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ అవినాష్ అట్టాడ ఆధ్వర్యంలో ట్రస్ట్ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, విద్యార్థులకు విద్యా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ, గిరిజనులకు రగ్గులు, చీరలు, విద్యా కిట్లు అందజేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ, గిరిజనులకు ఏ సహాయమైనా చేయడానికి ట్రస్ట్ సిద్ధంగా ఉందన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో కూడా ట్రస్టు ద్వారా గిరిజన ప్రాంతాల్లో సేవలందించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి బల్లా శ్రీనివాసరావు, సలహాదారులు కమల్ కుమార్, నాగేంద్ర బాబు, వైస్ ఎంపీపీ భూసరి కృష్ణారావు, నరేష్, ఈశ్వరరావు, అప్పారావు, రామ్మూర్తి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన

ప్రజాశక్తి-చింతపల్లి:సేంద్రియ ఎరువుల తయారీ పై యువ రైతులు, విద్యార్థులు చైతన్యవంతులు కావాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పరిశోధన స్థానంలో సేంద్రీయ వ్యవసాయం కోర్సులో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు సేంద్రీయ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త బాల హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ, సేంద్రీయ వ్యవసాయంలో పంటకు ద్రవ జీవామృతం ఘన జీవామృతం, వర్మి కంపోస్ట్ నాట్ కంపోస్ట్, ఆజోల్ల తరహా ఎరువులను పెట్టుకోవాలన్నారు. ఈ ఎరువులను రైతులు సమకూర్చుకోవాలన్నారు. ద్రవ ఘన జీవామృతాలను పశువుల మల మూత్రాలతో తయారు చేసుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సిఎంఎఫ్ రిసోర్స్ పర్సన్ రాజబాబు టీచింగ్ అసోసియేట్ బాబుజి నాయుడు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

పీసా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం


నియామక పత్రాన్ని ఇస్తున్న ఎన్నికల అధికారి

ప్రజాశక్తి - చింతపల్లి : మండలంలోని ఆంధ్ర కశ్మీర్ లమ్మసింగిలో పీసా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయిందని పీసా కమిటీ ఎన్నికల అధికారి సత్యనారాయణ రాజు అన్నారు. ఆయన మాట్లాడుతూ, లంబసింగి పీసా కమిటీ ఎన్నికలలో ఉపాధ్యక్షునిగా మర్రి బలరాం, కార్యదర్శిగా సరమండ వెంకట నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో చట్టాలు, హక్కులు రక్షణకు పీసా కమిటీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ ఎన్నికలలో తమపై నమ్మకం ఉంచి తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

పీసా కమిటీ సభ్యులకు సత్కారం

చింతపల్లి: గిరిజన చట్టాల, హక్కుల అమలుకు పీసా కమిటీ పటిష్టంగా పనిచేయాలని జడ్పిటిసి పోతురాజు బాలయ్య సూచించారు. స్థానిక పంచాయతీ అంతర్ల గ్రామ పీసా కమిటీ ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన గబులంగి నాగేశ్వరరావు, కవడం శివ సంతోష్లను ఆదివారం ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్య ప్రాంతంలో ఉన్న చట్టాల అమలుకు పీసా కమిటీ కృషి చేయాలన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా అవి అక్రమార్కులకు చుట్టాలుగా మారాయే తప్ప గిరిజనులకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. నూతనంగా ఎన్నిక కాబడిన పిసా కమిటీ సభ్యులు చట్టాల అమలుకు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి బూసరి కృష్ణారావు, నరేష్, ఈశ్వరరావు, అంతర్ల గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికైన వారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు ఆశ్లేషా

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని గుర్తించాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రతి విద్యార్థిలో ఏదో అంశంలో నైపుణ్యం ఉంటుందో దానిని గుర్తించి ప్రోత్సహిస్తే భవిష్యత్తు ఉన్నత స్థానానికి ఎదుగుతారని ప్రముఖ ఇంటర్నేషనల్ సైకాలజిస్ట్ ఆశ్లేషా ఈదల పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ మోదమాంబ హైస్కూల్లో నిర్వహించిన పేరెంట్, టీచర్ మీటింగ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల మానసిక-క్రమశిక్షణ, తల్లిదండ్రులు పిల్లల పట్ల భాద్యతలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో దిగజారుతున్న విలువలు, రుగ్మతలను వివరించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు ఎలా మెలగాలో తల్లిదండ్రుల బాధ్యతలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి ఘట్టా, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- చింతపల్లి :స్థానిక సీఏహెచ్ స్కూల్‌లో 2001-2002 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 23 సంవత్సరాల తరువాత ఒకరినొకరు కలుసుకోవడంతో చాలా ఆనందంగా గడిపారు. సి ఎ హెచ్ పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు అందరూ కలిసి సందడి చేశారు. ఆనాటి జ్ఞాపకాలను నెరవేసుకుని ఒకరి ఒకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిహెచ్ఎస్ పాఠశాల హెడ్మాస్టర్ సాగిన రామరాజు పడాల్, ఉపాధ్యాయులు తగ్గి త్రిమూర్తులకు పూర్వ విద్యార్థులు సన్మానించారు. అనంతరం లంబసింగి వద్ద విందును ఏర్పాటు చేసుకొని ఉత్సాహంగా గడిపారు.

ఆర్ఎంపి వైద్యులకు అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం గ్రామంలో ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం పద్మనాభం మండల గ్రామీణ వైద్యులకు విశాఖపట్నం, విజయనగరంలో ఉన్న రామచరణ్య హాస్పటల్ అధినేత, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బిఆర్.అచ్చన్నాయుడు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు ఎక్కువ జ్వరం వచ్చినప్పుడు తడిగుడ్డ వైద్యం చేస్తూ పారాసెటమాల్ మందును వయసు, బరువు ఆధారంగా ఇవ్వాల్సిన డోస్‌ను వివరించారు. యాంటీబయోటిక్ మందులు ఇవ్వరాదని తెలిపారు. రెండుమూడు రోజులకు మించి జ్వరం తగ్గకపోతే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రథమ చికిత్స ఎలా చెయ్యాల్లో కూడా వివరించారు. తల కిందికి దించుకొని పైకి ఎత్తలేకపోవడం, ఫిట్స్, మగతగా, నిస్సత్తువుగా ఉన్నవారిని, నీలం రంగులో, తెల్లగా పాలిపోయిన వారిని గుర్తించి ఎమర్జెన్సీగా పీడియాట్రిక్ ఫిజిషియన్‌కు రిఫర్ చేయాలని సూచించారు. రాలి అప్పారావు ఆధ్వర్యాన జరిగిన ఈ వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో ఎంవి.రమణ, యు.తాతబాబు, ఎంవి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడువలసలో తాగునీటికి అవస్థలు

గెడ్డ నీరే గతి!

గెడ్డలో ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి -అనంతగిరి:వేసవికాలం సమీపించక ముందే గిరిజన గ్రామాలలో దాహం కేకలు మొదలయ్యాయి. మండలంలోని నాన్ షెడ్యూల్ పంచాయతీ ఎన్ఆర్ పురం పరిధి నాయుడువలస గ్రామంలో తాగునీటి సమస్యతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నేటి వరకు ఆ గ్రామానికి ఎటువంటి బావి బోరు, పైపులైన్ వంటి పథకాలు నోసుకోలేదు. దీంతో గ్రామానికి కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎత్తయిన కొండ వాగు బండరాయి తొర నుండి వస్తున్న చెలమ నీటిని తాగాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో 30 కుటుంబాలపైగా జీవనం కొనసాగిస్తున్నారు. వ్యవసాయ పనులు అనంతరం ఇళ్లకు చేరిన తర్వాత ఆ కొండపై నీళ్ల కోసం రాత్రుల సమయంలో వెళ్లాలంటే జంతువులు దాడి చేస్తాయో నన్న భయంతో బిక్కుబిక్కుమంటూ టార్చ్ లైట్ లు వెలిగించుకుని మహిళలంతా గుంపుగా వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు అధికారుల దృష్టికి పలుమార్లు లిఖితపూర్వకంగా విన్నవించినా పట్టించుకున్న నాదుడే కరువయ్యారు.ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ గ్రామానికి పైపులైన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు

పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -అనంతగిరి:అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ 11 మండలాలలో అన్న పాఠశాలలు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి. శ్రావణ్ కుమార్ కోరారు విశాఖపట్నంలో పర్యటనకు వచ్చిన లోకేష్ ను ఆదివారం శ్రావణ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర వేడుకలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన ప్రాంతం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధిక శాతం నిధులు కేటాయించాలని కోరామన్నారు. మరమ్మతుకు గురైన పాఠశాల భవనాలు మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు కొత్త భవనాలు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు.

లోకేష్‌ను కలిసిన శ్రావణ్‌కుమార్

వైద్య శిబిరానికి విశేష స్పందన

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-చింతపల్లి: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్ బి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కే సౌమ్య సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ల ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని అంతర్ల గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆమె ముందుగా 42 మంది రోగులకు రక్త పరీక్షలు, 120 మందికి వైద్య సేవలు అందించారు. వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ స్కీమ్ సూపర్వైజర్ డి.రమణ మాట్లాడుతూ హెచ్.ఐ.వి, సుఖ వ్యాధులు, టీబీ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. లింక్ వర్కర్ పార్వతి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ హెచ్.ఐ.వి ని గురించి తెలుసుకొని రక్త పరీక్షలు చేసుకోవాలని సూచించారు. వైద్యాదికారిణి సామ్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడి పదార్థాలను మాత్రమే భుజించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్ల హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్, ఎం.ఎల్.హెచ్.పి. ఇ .లక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నిందితులతో పోలీసులు

16 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తీగల వలస పంచాయతీ పామురాయ్ జంక్షన్ వద్ద హుకుంపేట ఎస్సై ఎల్ సురేష్ సిబ్బంది, ఏపీ ఎస్పీ పార్టీతో వాహనాలు తనిఖీ చేస్తుండగా 16 కిలోల గంజాయి పట్టుబడింది. ద్విచక్ర వాహనంపై గంజాయి రవాణా చేస్తుండగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని ఎస్సై తెలిపారు.

ఆరు కిలోలతో ఇద్దరు అరెస్ట్

చోడవరం రూరల్: :మండలంలోని గౌరీపట్నం జంక్షన్ వద్ద పోలీసులు జరిపిన వాహన తనిఖీల్లో కారులో తరలిస్తున్న ఆరు కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ సి.నాగకార్తీక్ తెలిపిన వివరాలివి. ముందుస్తు సమాచారం మేరకు సిఐ ఆదేశాలతో పోలీసులు వాహన తనిఖీలు చేయగా, ఎపి 31బి 5783వాగనార్ కారులో ప్రయాణిస్తున్న ం చింతలపూడి. లావణ్య వెంకట సత్యకుమార్, చొప్పా. దిలీప్ వద్ద ఆరు కిలోల గంజాయి పట్టుబడింది.గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సి.నాగకార్తీక్ తెలిపారు.

ఎపి టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా కంచర్ల అచ్యుతరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖలో ఆదివారం ఉదయం జరిగిన ఆంధ్రప్రదేశ్ టార్గెట్ బాల్ అసోసియేషన్ తృతీయ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, టార్గెట్ బాల్ క్రీడకు పూర్వ వైభవం తీసుకొస్తానన్నారు. పాఠశాల స్థాయిలో టార్గెట్ బాల్ క్రీడను తీసుకెళ్తామని చెప్పారు. ఈ ఏడాది మార్చిలో విశాఖలో జాతీయ స్థాయి టార్గెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యువత చెడు మార్గం పట్టకుండా పయనించేందుకు ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ క్రీడలకు పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ్ శర్మ, రాష్ట్ర కార్యదర్శి సురేష్, సూర్య నారాయణ, ఉపకార్ ట్రస్ట్ మేనేజర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి

ప్రజాశక్తి- గాజువాక : ఇపిఎస్-95 పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు బైరెడ్డి గురప్ప, డి.వెంకట్రావు డిమాండ్‌చేశారు. పెదగంట్యాడ సిడబ్ల్యుసిలో ఆదివారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెన్షన్‌దారులకు మెడికల్ సదుపాయాలు కల్పించాలని కోరారు. సిఐటియు నాయకులు వైటి.దాస్ మాట్లాడుతూ, హక్కుల కోసం 150 సంవత్సరాల క్రితం మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ ముద్రించిన కేలండర్‌ను ఆవిష్కరించారు.

ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ప్రభుత్వ విప్ చిరంజీవిరావు

ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - చోడవరం : 1991-94లో చోడవరం గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో చదువుకున్న విద్యార్థులంతా అడ్డూరులో ఉన్న ఓ రిసార్ట్స్‌లో ఆదివారం కలుసుకుని సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ ఆత్మీయ సమావేశానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్రులు, విద్యార్థుల విస్తృత ప్రచారం తన విజయంలో కీలకపాత్ర పోషించిందని అన్నారు. అవినీతి, అబద్ధాలు లేని రాజకీయాలు చేయాలని అనుకుంటున్నానన్నారు. అనంతరం చిరంజీవిరావును మిత్రులంతా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, రమాకాంత్ బాబ్జీ, రవి ప్రతాప్, ఎస్.శ్రీను, సిహెచ్.వెంకటలక్ష్మి, గౌరినాయుడు, కోమలి, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - సీలేరు: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. జీకేవీధి మండలం దారకొండ పంచాయతీ కమ్మరితోట గ్రామానికి చెందిన అనిల్ తరచూ అత్తమామలతో గొడవలు పడుతుండేవాడు. ఈ క్రమంలోనే మనస్థాపానకు గురై ఆదివారం ఉదయం పశువుల మందులను తాగడంతో స్పృహ కోల్పోయాడు. అస్వస్థతకు గురైన అనిల్‌ను కుటుంబ సభ్యులు వెంటనే దారకొండ ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారి డాక్టర్ హిమబిందు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యశాల నిమిత్తం చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతానికి అనిల్‌కు ప్రాణాపాయం లేదని డాక్టర్ హిమబిందు తెలిపారు.

నేడు రాయగడ రైల్వే డివిజన్ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం జమ్మూ వేదికగా దేశ వ్యాప్తంగా పలు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని రాయగడ రైల్వే డివిజన్ భవనం ఉందని, దానికి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సమీప ప్రాంతాలలో కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు ఈ డివిజన్ తోడ్పడుతుందని తెలిపారు. తెలంగాణలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని చర్లపల్లి కొత్త టెర్మినల్ స్టేషన్‌ను సుమారు రూ.413 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయగా దానిని ప్రధాని ప్రారంభించనున్నారన్నారు. వీటితో పాటు 742.1 కిలోమీటర్ల పరిధిగల జమ్మూ రైల్వే డివిజన్‌ను కూడా పిఎం ప్రారంభిస్తారన్నారు.

7న వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని రద్దు చేస్తూ, ప్లాంటుకు సొంత గనులు కేటాయిస్తూ ప్రకటన చేయాలని విశాఖ జిల్లా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం 10 గంటల నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వద్దగల ఉక్కు దీక్షా శిబిరం వద్ద ధర్నా జరుగనుంది. జిల్లా వామపక్ష పార్టీల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం చేసినట్టు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు తెలిపారు. జగదాంబ దరి సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో జగ్గు నాయుడు, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి గోవిందరాజులు, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకర్రావు, సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు జిల్లా కార్యదర్శి దేవా తదితరులు మాట్లాడారు. విశాఖ ఉక్కు అశేష పోరాట, త్యాగాల ఫలితంగా ఏర్పడిందన్నారు. సుమారు లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ విశాఖ అభివృద్ధిలో అత్యంత కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

'ఉక్కు' నిరసనలు

స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని ప్రకటన చేయాలని నిర్వాసిత కాలనీల్లో పాదయాత్రలు

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక విలేకరులు

విశాఖలో ఆదివారం ఉక్కు నిరసనలు హోరెత్తాయి. ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఇవి సాగాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సహ ఉక్కు నిర్వాసిత కాలనీలన్నింటా కార్మికులు పాదయాత్రలు నిర్వహించారు.

పెద గంట్యాడలో పాదయాత్ర చేస్తున్న నాయకులు, ఉక్కు కార్మికులు

ఉక్కునగరం రైతు బజార్ వద్ద తలపెట్టిన కార్యక్రమంలో జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్రలను తీవ్రతరం చేస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఉక్కు యాజమాన్యం కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ప్లాంట్‌ను కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు వైటి.దాస్, డొక్కా నర్సింగరావు, వి.ప్రసాద్, పుల్లారావు, మహేష్, రాథోడ్, దుర్గాప్రసాద్, బిఎన్.మధుసూదన్, కృష్ణమూర్తి, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో..

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలంటూ జివిఎంసి 87వ వార్డు వడ్లపూడి నిర్వాసిత కాలనీలో పాదయాత్ర చేపట్టారు. పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ పాల్గొని ఉక్కు కర్మాగార విశిష్టతను తెలియజేశారు. పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, రాజన్ రాజు, విజయరామరాజు, కడుపుట్ల శ్రీను, చక్రవర్తి, శ్రీధర్, వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి పరిసర ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అగనంపూడి, డొంకాడ, కొండయ్య వలస, దిబ్బపాలెం తదితర ప్రాంతాల్లో ఈ ర్యాలీ సాగింది. ఉక్కు రక్షణ నినాదాలు ఆ ప్రాంతాల్లో మార్మోగాయి.

పెదగంట్యాడలో..

పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో జరిగిన పాదయాత్రలో పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, మంత్రి రాజశేఖర్, పులి రమణారెడ్డి, మహేశ్వర రెడ్డి, వై.శ్రీనివాసరావు, ఆదినారాయణ, బొడ్డు పైడిరాజు, ప్రభాకర్ రెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు రక్షణ కోసం సోమవారం జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెదగంట్యాడ కూడలి నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర నెల్లిముక్కు, బాలచెరువు మీదుగా నడుపూరు వరకూ సాగింది.

సమన్వయంతో వ్యవహరించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

ఈ నెల 8న విశాఖలో ప్రధాని మోడీ పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించాలని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ అంశాన్నే సింగిల్ అజెండాగా పెట్టుకొని అహర్నిశలూ శ్రమించాలని సూచించారు. ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే ప్రధాని బహిరంగ సభ, రోడ్ షో ఏర్పాట్లపై ఆయన ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాసు, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్‌లు గణబాబు, వేపాడ చిరంజీవిరావు తదితరులతో ఆదివారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో సమీక్ష జరిపారు. అనంతరం ఎయు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, సిపి శంఖబ్రత బాగ్చీ ఏర్పాట్లు తీరును లోకేష్‌కు వివరించారు. అనంతరం లోకేష్ మీడియాతో మాట్లాడుతూ రోడ్‌షో బాధ్యతలు గణబాబు, బహిరంగ సభ బాధ్యతలు పల్లా శ్రీనివాసరావు తీసుకోవాలని నిర్ణయించామని వెల్లడించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు రవాణా, తాగునీటి వసతి, పార్కింగ్ సదుపాయంపై పలు సూచనలు చేశారు. సిరిపురంలోని వెంకటాద్రి వంటిల్లు నుంచి ఎయు ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన మైదానం వరకు ప్రధాని మోడీ రోడ్ షో ఉంటుందని, ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన సభా వేదికకు చేరుకుంటారని తెలిపారు. ప్రజలు ప్రధానికి చేరువుగా ఉండేలా బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని, డబుల్ బారికేడింగ్ కాకుండా సింగిల్ బారికేడింగ్ విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రధానితో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రోడ్ షోలో పాల్గొంటారన్నారు. వివిఐపి, విఐపి వాహనాల పార్కింగ్, ప్రజల వాహనాల పార్కింగ్‌కు 26 ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసినట్టు అధికారులు మంత్రికి తెలిపారు. పాస్‌ల జారీకి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. లోకేష్ వెంట రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్షలో మంత్రి లోకేష్ - ఎయులో పనుల పరిశీలన

ఐటి రంగానికి విశాఖ రాజధాని

విశాఖను ఐటి రాజధానిగా చేస్తామని మంత్రి నారా లోకేష్ చెప్పారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన మంత్రులు, అధికారుల సమావేశం అనంతరం పోర్టుకో వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ విశాఖకు అనేక పరిశ్రమలు రానున్నాయని చెప్పారు.

సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజు

సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం ధారకొండ పంచాయతీ కమ్మరితోట గ్రామంలో సిసి రోడ్డు పనులకు స్థానిక సర్పంచ్ నడిగట్ల రాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.రెండు లక్షల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతాయని, ఈ రోడ్డు పూర్తయితే కుమ్మరితోట వాసులకు రహదారి కష్టాలు కొంతమేర తొలగుతాయని సర్పంచ్ రాజు అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాడి రామన్న, వార్డు సభ్యులు కిలో. ఆంజనేయులు, కె. ప్రసాదు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాస్టల్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తే విద్యార్థులు కళాశాలలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు వెల్లడించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం జూనియర్ కళాశాలలో 92 మంది ఇంటర్ ఫస్టియర్, సెకెండియర్ విద్యార్థులు చదువుతున్నారన్నారు. వీరిలో 49 మంది విద్యార్థులు స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో భోజన, వసతి సౌకర్యాలు పొందుతున్నారన్నారు. మరొక 46 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకానికి అర్హులన్నారు. దట్టమైన అటవీ ప్రాంతానికి జూనియర్ కళాశాల చేరువలో ఉండడం, ప్రహరీ లేకపోవడంతో రక్షణ కరువైందని విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. రాత్రివేళల్లో అడవి పందులు, ఎలుగుబంట్లు కళాశాల ప్రాంగణంలో సంచరిస్తున్నాయన్నారు. కళాశాలకు ప్రహరీ లేకపోవడం, ఇతర సమస్యలపై స్థానిక ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో, ఇతర కూటమి నాయకులు స్పందించి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ దృష్టికి తీసుకెళ్లారు. కళాశాలకు అనుబంధంగా 2012లో పోస్ట్‌మెట్రిక్ బాయ్స్ హాస్టల్ సౌకర్యాన్ని కల్పించగా, బాలికలు మాత్రం హాస్టల్ వసతి సౌకర్యాలు లేకపోవడంతో నానాఅవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవచూపి, సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అనుబంధంగా బాలికల హాస్టల్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తే మరింతమంది గిరిజన బాలికలు స్థానికంగానే ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇంటర్ విద్యను పూర్తిచేసే అవకాశం ఉంటుందని అంటున్నారు. హాస్టల్ ఉంటే కాలేజీలో చేరేందుకు బాలికలు ఆసక్తి కనబరిచే అవకాశం ఉందని అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - సీలేరు: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలివి. దారకొండ పంచాయతీ కమ్మరి తోట గ్రామానికి చెందిన జమున, మల్లమ్మ, ఏడు నెలల చిన్నారితో కలిసి బైక్‌పై స్థానిక పిహెచ్‌సికి వైద్యం కోసం వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొన్నాయి.. ఈ ఘటనలో జమున ఎడమ మోకాలు దగ్గర గాయం కాగా, మల్లమ్మకు ఎడమ భాగం కంటిపై గాయమైంది.. చిన్నారి దీపికకు ఎడమ మోకాలు, నుదుటిపై చిన్నగాయాలయ్యాయి. క్షతగాత్రులకు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు ప్రథమ చికిత్స చేసి, అనంతరం మెరుగైన వైద్యసేవలు కోసం చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

24న డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఈ నెల 24న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ ఎస్సి, ఎస్టి గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ - 2025 డైరీ ఆవిష్కరణ సభ జరుగుతుందని అసోసియేషన్ విశాఖ యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యజ్జల విజయ కుమార్, మల్లిపూడి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ముక్కల రాజేంద్ర కుమార్ తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్ నేతృత్వంలో జరిగే ఈ డైరీ ఆవిష్కరణ సభకు రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, నారా లోకేష్, గుమ్మడి సంధ్యారాణిని ఆహ్వానించినట్లు వారు తెలిపారు.